నాపాక ఆలయాన్ని అభివృద్ధి చేస్తా..



చిట్యాల: మహిళలను ఓటు అడుగుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

● బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

చిట్యాల: ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపిస్తే నాపాక ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి, నైన్‌పాక గ్రామాల్లో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా గడపగడపకు తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం నైన్‌పాకలో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్నానని ఆదరించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, నారాయణరెడ్డి, మాచర్ల రఘు, గొర్రె శశి, ఉడుత వనక్క, చెక్క నర్సయ్య, పిట్టల నాగరాజు, రాజేష్, రవీందర్, నాయకులు వీరస్వామి, సంపత్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని గడప గడపకు తిరిగి నాయకులు శనివారం ప్రచారం చేశారు.

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో దొంగల రాజేందర్, 29 వార్డులో వార్డు అధ్యక్షుడు ఈర్ల మల్లికసదానందం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఆవుల సంతోష్, భూత్ అధ్యక్షుడు సిలువేరు కార్తీక్, తాండ్ర హరీష్, దాసరి సంతోష్ ఉన్నారు.

ఎడ్ల బండి ఆపి..



ఓటు అడుగుతున్న కీర్తిరెడ్డి

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అందులో భాగంగా గ్రామంలోని మహిళా రైతు తన వ్యవసాయ భూమి వద్దకు ఎడ్ల బండిపై వెళ్తున్న క్రమంలో ఆపు.. ఆపు.. అక్క మీ ఓటు నాకే వేయాలని కోరింది. దీంతో ఆమె తప్పకుండా మేడం అంటు మాట ఇచ్చింది.

మోసపూరిత మాటలను తిప్పికొట్టాలి



సంగెం: ఆశాలపల్లిలో ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న చల్లా ధర్మారెడ్డి



సంగెం: కాపులకనిపర్తిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

● ప్రతిపక్షాలు మోకాలడ్డుపెట్టినా 'రైతుబంధు' ఆగదు
● బీఆర్ఎస్ పరకాల అభ్యర్థి ధర్మారెడ్డి

సంగెం : ఆరు గ్యారంటీ పతకాలంటూ ఊర్లకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు తిప్పికొట్టాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని అధిగమించి యాసంగి పెట్టుబడి సాయం రైతుబంధు పథకం అన్నదాతల ఖాతాల్లోకి జమ కానున్నాయని స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గుంటూరుపల్లి, కాపులకనిపర్తి, ఆశాలపల్లి, రామచంద్రాపురం, వెంకటాపూర్, కాట్రపల్లి, గవిచర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్, పరకాల నియోజకవర్గాన్ని నేను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. అరవై ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమం ఏం చేయలేదు. ఇప్పుడు ఒక్క చాన్స్ అంటూ బోగస్ మాటలు చెప్పుకుంటూ ఊళ్లలోకి వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ చెబుతున్న గ్యారంటీలకు వారంటీ లేదు. పార్టీల నాయకులను గ్రామాల్లోకి రాకుండా తరిమి కొట్టండి' అని వ్యాఖ్యానించారు. రామచంద్రాపురంలో రూ.53. కోట్లతో అభివృద్ధి చేశామని, కళ్లముందు కన్పిస్తోందన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేయగానే సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అత్తకు రూ. 5వేలు, కోడలకు రూ. 3వేలు అందిస్తామన్నారు. పట్టణాల కంటే పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. మండలానికి దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కును తీసుకువచ్చామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కేసీఆర్ భరోసా మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు ప్రజలకు దోహదపడుతాయన్నారు.

వెలమ సంఘం ఏకగ్రీవ తీర్మానం

మండలంలోని కాపులకనిపర్తి గ్రామ వెలమ సంఘం నాయకులు, 50 కటుంబాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అధ్యక్షుడు దుగ్యాల గోపాల్‌రావు, కార్యదర్శి పోలాల గోపాల్ రావు, సభ్యులు దేవేందర్‌రావు ప్రకటించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని పల్లారుగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

అభివృద్ధిని చూసి ఓటేయ్యండి

పరకాల : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని బీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 9, 21 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు.



పరకాల : చల్లా జ్యోతికి బొట్టు పెడుతున్న మహిళ

మోడల్ ఈవీఎంలో కారు గుర్తును చూపుతూ ఓటు అభ్యర్థించారు. స్థానిక మహిళ ఓటర్లు బొట్టుపెట్టి ఆహ్వానించారు. అదే విధంగా 1, 10, 13 వార్డు కౌన్సిలర్లు మడికొండ సంపత్, పసుల లావణ్య, రజని ప్రచారం చేపట్టారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

ఆత్మకూరు: బీఆర్ఎస్ పార్టీ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలని మండలంలోని నీరుకుళ్లలో విద్యార్థి విభాగం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్షం మధుకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ కష్టాలే

● బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



శాయంపేట: ఎమ్మెల్యే గండ్రకు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళ

శాయంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే కరెంట్ కష్టాలు తప్పవని భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని కొప్పుల, వసంతాపూర్, గంగిరేణిగూడెం సూర్యానాయక్‌తండా, కాట్రపల్లి, ప్రగతిసింగారం, పత్తిపాక, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో శనివారం ప్రజా ఆశ్వీరాద యాత్రను జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకోడెపాక రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగలంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని గెలిపించాలని అన్నారు. 80వేల కోట్ల ప్రజాధనంతో రైతాంగానికి రైతుబంధు అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఈ నెల 30వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతలక్ష్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు మాధురిమహేశ్, అనూష, మంజుల, రమేష్, సుమలత, ఎంపీటీసీలు వేణుగోపాలప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా ఉండాలి

చిట్యాల: నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రజలు అండగా ఉండి మళ్లీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక నిధులు కేటాయించడంతో ఈ ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. గండ్ర వెంకట రమణారెడ్డిని ప్రజలు గెలిపిస్తేనే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు మేకల కుమార్, చిగురు రవి, బాశవేన భిక్షపతిలతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు జాలిగపు కిష్టయ్య, నాయకులు దొడ్డి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటె ధర్మారావు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, నాయకులు ఎలేటి నర్సింహారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, జనార్ధన్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న కష్ట సుఖాల్లో పాలపంచుకుంటూ అందుబాటులో ఉంటున్నానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఏరియాలోని కేటీకే 5వ గనిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా పని చేసిన రెండు సార్లు 2వేల సింగరేణి క్వార్టర్లు నిర్మించినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా భూపాలపల్లిలో డబుల్‌బెడ్ రూం క్వార్టర్లు నిర్మించినట్లు వివరించారు.



భూపాలపల్లి అర్బన్ కార్మికులతో ఎమ్మెల్యే

బీఆర్ఎస్‌కు గౌడ సంఘాల మద్దతు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి గౌడ సంఘాల జేఏసీ మద్దతు ఇస్తున్నట్లు గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ఉమ్మడి జిల్లా కన్వీనర్ చిర్ర రాజుగౌడ్, జిల్లా గౌడ సంఘాల చైర్మన్ బుర్ర రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ సంఘాల అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 30గుంటల స్థలం, రూ.1కోటి నిధులు కేటాయించినట్లు తెలిపారు. గండ్ర వెంకటరమణారెడ్డి పూర్తి మద్దతు ప్రకటించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తాటి అశోక్, బుర్ర కుమార్‌స్వామి, వేణుగోపాల్, శ్రీహరి, రవీందర్, గణపతి, సదానందం, శ్రీధర్, రాజమళ్ల పాల్గొన్నారు.



శాయంపేట: ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



శాయంపేట: బతుకమ్మ ఎత్తుకున్న గండ్ర జ్యోతి

'గండిపల్లి'ని ఎందుకు పూర్తి చేయలే..?

● హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): అధికారంలో ఉండి పదేళ్ల గడిచినా గండిపల్లి ప్రాజెక్టులో తట్టెడు మట్టి కూడా తీయలేదని, ఈ అసమర్థ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను ఓటు ద్వారా ఇంటికి సాగనంపాలని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని ధర్మారం, తుర్కనవానికుంట, పోతారం(జే), గండిపల్లి, పంచరాయితండా, కుందనవానిపల్లి, మైసమ్మవాగు తండాతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో వస్తే 3 గంటల కరెంట్ అంటూ బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ అని, అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అయిలయ్య, సృజన్‌కుమార్, తిరుపతినాయక్, జనార్దన్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



గండిపల్లిలో పొన్నంకు స్వాగతం పలుకుతున్న మహిళలు

పొన్నం సతీమణి ప్రచారం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాలలో పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల ప్రచారం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. ఒక్క అవకాశం కల్పించి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. మహిళలు ఆమెకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బస్వరాజు శంకర్, మాజీ సర్పంచ్ దొమ్మాట జగన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శంకర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి గోస తీర్చాం.. అభివృద్ధి చేశాం



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, పక్కన సతీశ్‌కుమార్

● హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

హుస్నాబాద్: 2014కు ముందు నీటి కోసం ఆడబిడ్డలు అరిగోస పడ్డారని.. తెలంగాణ వచ్చిన తర్వాత మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగు నీరు అందుతుందని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో కలిసి హుస్నాబాద్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వందశాతం దళిత బంధు, బీసీ బంధు, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని పట్టణంలో లైట్లు, రహదారులు, మురికి కాలువలు నిర్మించుకొని పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుకున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ అన్నిరంగాల్లో సమగ్ర అభివృద్ధి చెంది ప్రగతి పథంలో ముందుకెళ్తుందన్నారు. మిడ్‌మానేర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో 23వేల ఎకరాలకు సాగునీటి అందిస్తున్నామని తెలిపారు. దేవాదుల ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు 17 వేల ఎకరాలకు, శనిగరం ప్రాజెక్టు ద్వారా 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం బీజేపీకి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ వేణయాదవ్ బీఆర్ ఎస్‌లో చేరగా ఆహ్వానించారు.

ప్రత్యర్థులను శత్రువులుగా చూడొద్దు: వినోద్‌కుమార్

రాజకీయాల్లో ప్రత్యర్థులను శత్రువులుగా చూడొద్దని, ప్రజాసేవే ముఖ్యమని రాష్ట్ర ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో సీఎంను మార్చాలంటే మతకల్లోహాలు, అలజడులు ఉండేవని, బీఆర్ఎస్ పాలనలో కర్ఫ్యూ, రాజకీయ అలజడి లేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు ఒక్క మెడికల్ కళాశాల తీసుకురాలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు వాల సుప్రజ, గూళ్ల రాజు, పెరుక భాగ్యరెడ్డి, బొల్లి కల్పన, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష తదితరులు ఉన్నారు.

దళితులకు సముచిత స్థానం

హుస్నాబాద్‌రూరల్: కేసీఆర్ పాలనలో దళితులకు సముచిత స్థానం దక్కిందని హన్మకొండ జెడ్పీ చైర్మన్ మారంపెల్లి సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దళిత ప్రజాప్రతినిధుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దళితులు బాగుపడలేదని, ఎప్పుడో ఇందిరమ్మ భూములు ఇస్తే ఇప్పటికి వాటి హద్దులు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ సాయన్న, సర్పంచ్‌లు ప్రవీణ్, మాజీ ఎంపీటీసీలు వెంకటస్వామి, కోతి రాంచంద్రం, కౌన్సిలర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: శాంతినగర్, దండేపల్లి, పాలాటిపల్లి, కేశవాపూర్, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ ఆదివారం ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్య గౌడ్, మారుపాటి మహేందర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

ఎల్కతుర్తి: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని హుస్నాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డు, మరుగుదొడ్ల నిర్మాణం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వంటి పథకాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఒక్క అవకాశం కల్పించి పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. మండల అధ్యక్షుడు చిరంజీవి, పృథ్వీరాజ్‌గౌడ్, నాయకులు కిష్టయ్య, మధు, శంకరయ్య, వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

ఎల్కతుర్తి: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై సాయిబాబు అన్నారు. భీమదేవరపల్లి మండలం ములకనూర్‌లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కమలాపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఉప్పల్, కన్నూరు, భీంపల్లి, కానిపర్తి, గూడూరు, అంబాల, శనిగరం, వంగపల్లి, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీస్‌లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎస్సైలు కరుణాకర్, సీమాఫర్హీన్, బీఎస్ఎఫ్ కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐనవోలు: మండల కేంద్రంతో పాటు ఒంటిమామిడిపల్లి, కొండపర్తి, వనమాలకనపర్తి గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని పోలీసులు సూచించారు. ఎస్సై నవీన్‌కుమార్, శ్రీనివాస్, బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

పరకాల : భారత దేశ రాజ్యాంగం దేశ ప్రజల గౌరవానికి, ఐక్యతకు దోహదపడుతుందని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అరుణ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.ఓదేలు, అధ్యాపకులు ఎం.రవికుమార్, డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, ఆర్.కుమారస్వామి, అశోక్‌మోరె, సి.హెచ్ సుస్మిత, పి.సుభాషిణి, రాజశ్రీ, దుప్పటి సంజయ్, రఫీ, శ్యాంసుందర్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏకశిల హైస్కూల్‌లో మాక్ పోలింగ్

ఐనవోలు: మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద గల ఏకశిల హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఎన్నికల జరిగే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐదుగురు అభ్యర్థులకు గుర్తులు కేటాయించి, మాక్ బ్యాలెట్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులతో ఓటు వేయించారు. ఎన్నికల విధుల్లో విద్యార్థులు పాల్గొనేలా ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. పాఠశాల అడ్మిన్ ఇన్‌చార్జ్ ఎండి బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

శాయంపేట : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ప్రజ్వల్ ఎఫ్‌సీఎల్ ప్రొడ్యూసర్ మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో శనివారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశ చాలా కీలకమైందని అన్నారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలు బడి మానేసి పనులు చేస్తే వెంటనే చైల్డ్‌లైన్ నంబర్ 1098కి సమాచారం ఇవ్వాలని కోరారు. సిబ్బంది రాంబాబు, గౌస్, సునీల్, ప్రశాంత్, భానుమతి, కల్పన పాల్గొన్నారు.

స్త్రీ, పురుష భేదాన్ని రూపుమాపాలి

పరకాల: ప్రతి కుటుంబంలో స్త్రీ, పురుష భేదం లేకుండా సమాన పరిస్థితి కల్పించాలని సామాజిక వేత్త, రచయిత్రి అనిశెట్టి రజిత అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం (వైట్ రిబ్బన్ డే) శనివారం నిర్వహించారు. మహిళలపై, ఆడపిల్లలపై జరుగుతున్న హింస, వేధింపులు, అత్యాచారాలను రూపుమాపాలని సూచించారు. సీనియర్ న్యాయవాది గండ్ర నరేష్‌రెడ్డి, ప్రొఫెసర్ వేణు, సర్వోదయ ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్, అక్తర్, శ్రీలత పాల్గొన్నారు.

ఓటు వేసిన దివ్యాంగులు

ఐనవోలు: మండల వ్యాప్తంగా దివ్యాంగులు, వృద్ధులు హోం ఓటింగ్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లలేని వికలాంగులు, వృద్ధులు హోం ఓటింగ్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో అధికారులు వారి ఇంటి వద్దకెళ్లి ఓటును స్వీకరించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బెజ్జం భిక్షపతి, కొత్తూరి విజయ్, పోలెపాక అఖిల్ తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

కమలాపూర్: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వాములు సామూహిక నిత్యాన్నదానాన్ని గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు ప్రారంభించారు. 2024 జనవరి 5 వరకు కొనసాగుతుందని తెలిపారు.

బీజేపీని గెలిపించాలని ప్రచారం

ఐనవోలు: అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజవకర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండేటి శ్రీధర్‌ను గెలిపించాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఒక్క అవకాశం కల్పించి పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

దామెర: కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని పరకాల కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు ఊరుగొండ, దుర్గంపేట్‌లో శనివారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన పథకాలు అమలు చేయకుండా మళ్లీ ఎన్నికల్లో ఓటు అడగడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

నడికూడ: రాయపర్తికి చెందిన బీఆర్ఎస్ వార్డు సభ్యుడు అల్లే రాజు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పరకాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న రేవూరి ప్రకాష్ రెడ్డి